# కొత్త పద్ధతులు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

జోగారావంటేనే నాకు మొదటినుంచి మంట. వాడేది చేసినా నాకు తప్పుగానే తోస్తుంది. ఇంకోడి నోటివెంటవస్తే ఆమోదించేముక్కలే వాడనటం మొదలు పెడితే నాకు చిరాకెత్తుంది.

తనొక పెద్దసంస్కారపరాయణుడనీ అధునాతనత్వం తనుగా మూర్తీభవించిందనీ జోగారావు అనుకోవటమే కాదు, అంటాడు కూడానూ. వితంతు వివాహాలకు నడుము కట్టుకోడనీ, శాఖాంతర వర్ణాంతర వివాహాలు చేయించడనీ, తనబంధువర్గంలో ఉన్న ఆడపిల్లలకంటె ఊళ్లోఉండే వెధవపిల్లలను అధికంగా చూడడనీ నేననను!... కాని ఒక్కటి ఘట్టిగా చెప్పగలను: ఆడవాళ్లకు సంబంధించని సంఘ సంస్కారంజోలికి జోగారావు వాడిజన్మలో వెళ్లి ఎరగడు. మీ ఖద్దరూ, మీ హరిజనసమస్యా — ఇటువంటి దిక్కుమాలిన సమస్యలజోలికి వాడు ఛస్తేపోడు. రజస్వలావివాహాలంటే, వితంతు వివాహాలంటే, ఆడవాళ్ల విద్యాసంస్కార స్వాతంత్ర్యాదికాలంటే వాడికి నల్లేరుమీది బండినడక. ఎవడిహక్కు భుక్తాలలోనూ లేని స్త్రీత్వం వాణ్ణి చెడ్డ ఆకర్షించేది. పెళ్లికాకపూర్వమే రజస్వలలయినపిల్లలూ, వితంతువులూ వాడికి ఆరాధ్యవస్తువులు.

దానికి కారణంకూడా నే నెరుగుదును. వాడి భార్య కట్టెనూ కంపనూ కాలనికొరివి, మగరాయుడు, ఎండుకట్టె. ఎన్నడూ ఏ అవినీతికరమైన పనికీ పాల్పడని జోగారావు దిక్కులేక, ప్రకృతి ప్రేరేపణను జయించే సంస్కారంలేక, ఆభార్యనే అమితప్రేమతో ఆరాధించుతూ వచ్చాడు. ఆక్షుద్ర ఉపాసన నెత్తి అడిచింది. జోగారావుసంస్కారప్రియత్వమంతా దానిఫలితం.

వాడిమూలంగా నాకు చాలకాలం హైమవతి మీదకూడా అర్థంలేని దురభిప్రాయం ఉండేది. ఆ పిల్ల వాణ్ణి “బాబాయి,” అని పిలుస్తుంటే నాకు తిక్కెత్తుకొచ్చేది. వాడాపిల్లకేమీ కాడు. హైమవతి చిన్నతనంలో నాలుగైదుసంవత్సరాలపాటు ఆపిల్ల తల్లిదండ్రులు జోగారావుగారింట్లో అద్దెకున్నారు. ఆరోజుల్లో వీడాపిల్లను ఒక్కసారయినా దగ్గిరికి తీశాడనికాని ఒక్క బిస్కటుముక్క ఆపిల్లకు కొని పెట్టినపాపాన పోయినాడనికాని అనుకోను. ఆపిల్ల పెళ్లికి వాడు పోలేదని నాకు స్పష్టంగా తెలుసును. కాని హైమవతిభర్త పోయినపదోరోజుకల్లా వీడు హాజరూ! వాళ్లెవరూ ఆమెజుట్టు తీసేప్రయత్నంలో లేకపోయినప్పటికీ వాడుమాత్రం ఆదురాచారంగురించి చాలాసేపు గంభీరోపన్యాసం ఇచ్చి ఆమెభావి యావత్తూ ఆరోజు సూర్యాస్తమానం అయేలోపల వివరంగా నిర్ణయించేశాడు.

అయితే హైమవతి చదువుకుమాత్రం జోగారావు చాలావిధాల సహాయపడినమాటమాత్రం నిజం. ఆమె ఒక్కొక్కతరగతే పాసవుతున్నకొద్దీ జోగారావు తనజన్మ సార్థకమవుతున్నట్టు భావించాడు. ఆఖరుకు హైమవతి వాడి కొక ఆశయం అయిపోయింది. దానిముందు విశాలమైన సంఘ సంస్కారాభిలాషకూడా తుడిచిపెట్టుకుపోయింది.

ఎట్లాగైతేనేం హైమవతి బి. ఏ. డిగ్రీ తెచ్చుకున్నది. అంతటితో జోగారావు నిర్ణయించిన క్రమం కాస్తా అడ్డంతిరిగింది. హైమవతి పెళ్లి తన చేతిమీదుగా చేసి నిభాయించలేనని ఆమెతండ్రి ఖండితంగా చెప్పేశాడు!

జోగారావు అంత సులభంగా ఓడిపోదలచ లేదు. “ఆ కార్యభారం యావత్తూ నామీద వెయ్యండి, అన్నగారూ!” అన్నాడు జోగారావు. “మీరేమైనా చేసుకోండి. నా పూచీమాత్రం ఏమీ లేకుండా ఉంటే

పరి"అన్నాడు హైమతండ్రి. ఆరోజులగాయతు హైమ జోగారావు కుటుంబంలో చేరిపోయింది.

ఆమెకు జోగారావు తెచ్చిన సంబంధంకూడా నాకాశ్చర్యం కలిగించింది. సూర్యనారాయణ మేధావీ, స్ఫురద్రూపీ, చిన్న జమీందారూనూ! అతను బి. ఏ ఆనర్సు పాసయి హైమకోసం కనిపెట్టుకున్న వాడల్లే పెళ్లీ పెటాకులూ లేకుండా ఊరికే కూర్చున్నాడు. జోగారావు ఈ సూర్యనారాయణను ఎప్పుడు ఎక్కడ ఏ గాలంవేసి పట్టాడో నాకైతే తెలియదుకాని ఆకుర్రవాడితో ఒకటిరెండుసార్లు మాట్లాడిన తరవాత హైమవంటి విద్యాధికురాలికి అంతకంటె మంచిభర్త దొరకడనుకున్నాను. నిజంగా ఆపెళ్లే జరిగితే జోగారావును గురించి నా అభిప్రాయం యావత్తూ ఒక్కక్షణంలో మార్చేసుకోవటానికికూడా సంసిద్ధుణ్ణయినానంటే నమ్మండి.

అయితే జోగారావు దిగ్విజయానికి తలవని తలంపుగా మరొక అంతరాయం వచ్చింది — హైమ తనకు పునర్వివాహం అవసరం లేదన్నది.

"మా అమ్మమ్మ అంటూండేది— వెధవముండ పెళ్లి వెధవపెళ్లేనని. అది నిజంకూడాను!" అన్నది హైమ కరుకుగా.

"ఏం? ఏం? ఏం?" అన్నాడు జోగారావు నోట మాట రాక.

"ఈ వెధవపెళ్లిళ్లు సామాన్యంగా సరిగా పరిణమించవు. ఏదో వంక రానేవస్తుంది!" అని హైమ సమాధానం చెప్పింది.

"నాన్సెన్స్! మామూలు పెళ్లిళ్లుకూడా అంతే, ఆమాటకు వస్తే!" అన్నాడు జోగారావు, బహుశా తనపెళ్లి స్మరిస్తూ.

"ఆపెళ్లిళ్లు ఎట్లా తగలబడినా ఫరవా లేదు. అవి సంఘదేవతకు బలులు! పితృదేవతలు తరించటానికి చేసేవి. ఆపెళ్లిళ్లు చెయ్యకపోతే ఆడపిల్లలు అంటరానివాళ్లవుతారు! చేజేతులా అటువంటిపెళ్లే మళ్లీ, ఏరికోరి, ఎవరి ప్రోద్బలమూ లేకుండా, పైగా నలుగురిఇష్టాన్నీ తిరస్కరిస్తూ చేసుకోవటం బుద్ధితక్కువ కాదూ?" అన్నది హైమవతి ఒకేసుక్కలో.

"అదేంమాట? ఇతర విధవావివాహాలు ఎట్లా అయితే నీకెందుకు? నీకు అన్నివిధాలా నచ్చినమొగుడు దొరికితేనేచేసుకో, లేకపోతే మానెయ్యి!" అన్నాడు జోగారావు.

"అదే నేనూ అంటున్నా!" అన్నది హైమ.

ఆమర్నాడు సాయంకాలానికల్లా గారడివాడు మంత్రించి బుట్టలోనించి తీసినట్టు జోగారావు ఎక్కణ్ణుంచో సూర్యనారాయణను ప్రొడ్యూస్ చేశాడు!

ఆ మొదటిరోజు సంభాషణలో జోగారావు విశేషం కల్పించుకోలేదు, వెయ్యికళ్లతో సూర్యనారాయణనూ హైమవతినీ కనిపెడుతూ వచ్చాడు. కాని వాళ్ల సంభాషణ ఆమూలాగ్రం వినేసరికి జోగారావు గుండె నీరయిపోయింది.

"నాకు స్వతస్సిద్ధంగా మగవాళ్లంటే పరమ అసహ్యం!" అన్నది హైమ ఏ సందర్భంలోనో.

సూర్యనారాయణ ఎంతో మృదువుగా మందహాసంచేస్తూ, "నాకు ఆడవాళ్లంటే కూడా, అంతే" అన్నాడు.

ఈ విషయంమీదే ఆ ఇద్దరూ జోగారావు సహాయం దాదాపు ఏమీఅవసరం లేకుండా, పునరుక్తిదోషం రానివ్వకుండా, రెండుగంటలు మాట్లాడుకున్న తరవాత సూర్యనారాయణ లేచి, "పొద్దుపోతున్నది, వస్తాను!" అంటే, "నేను పోతున్నాను. పొద్దు మళ్లీ రేపు వస్తే వస్తుంది. నేనుమాత్రం రాను!" అన్నట్టు ధ్వనించింది జోగారావుకు.

కాని అంతవరకు జోగారావు పొరపాటు పడ్డాడు. ఏమంటే, సూర్యనారాయణ మర్నాడు మళ్లీ వచ్చాడు. అయితేఏం? నిన్నటిచర్చ ఎక్కడ ఆగిందో అక్కడ మళ్లీ ప్రారంభమయింది. అది చర్చమాదిరిగా కూడా లేదు జోగారావు చెవులకు, కొట్లకుక్కల అంతః కలహంలాగు కనిపించింది. ఆడవాళ్లకు విరుద్ధంగా సూర్యనారాయణా, మగవాళ్లకు విరుద్ధంగా హైమవతీ వకాలతు పుచ్చుకుని మొత్తంమీద

ద్దరూ కలిసి మానవ మనస్తత్వాన్ని కడిగి తూర్పార బట్టారు. "అవతలమనిషి ఆడదే! కాస్తసౌజన్యంచూపింతా"మని సూర్యం కాని, అతన్ని ఆకర్షింతామనీ, మెప్పింతామనీ, స్త్రీ సహజమైన మార్దవం ప్రకటింతామనీ హైమ కాని ప్రయత్నలేశం కూడా చెయ్యటం లేదు.

"ఒకవేళ వీళ్లిద్దరూ పెళ్లాడితేమాత్రం ఆకాపరం ఎట్లా ఏడుస్తుంది!" అని ఆశ్చర్యపడ్డాడు జోగారావు.

వాళ్లిద్దరూ మాట్లాడుకునే విధానమే కాక విషయాలుకూడా జోగారావుకు నచ్చలేదు. మానవ మనస్తత్వంగురించి మాట్లాడటం అయిపోయినతరవాత వాళ్లు మాట్లాడిన విషయం ప్రేమ! అది కూడా ఎంత విలక్షణంగా!

జోగారావు అభిప్రాయంలో పెళ్లాడబోయ్యే వాళ్లు మూడో ప్రాణి ఎదుట ప్రేమప్రస్తావన తేగూడదు. తెచ్చినవాళ్లు దాన్ని గురించి ముచ్చటగా ముచ్చటించవలిసిందేగాని ముక్కముక్కలు చెయ్యటం ఏమి రసికత్వమో జోగారావు కర్థం కాలేదు.

"ప్రేమ" అనేమాట సూర్యనారాయణ నోట వచ్చిరాకపూర్వమే హైమ "నాకు ప్రేమలో నమ్మకం లేదు. తనమీద ఒక్క దమ్మిడీ కూడా లేకుండా జీవించటం ఎంత సులభమో ప్రేమ లేకుండా జీవించటం అంత సులభం!" అన్నది.

హైమవతి ఆ వాక్యం పూర్తి చేసేలోపుగా జోగారావు మూడు చావులు చచ్చి నట్టయినాడు!

"నాకు ప్రేమలో చాలా విశ్వాసం ఉంది!" అన్నాడు సూర్యనారాయణ గంభీరంగా — "నీ అజ్ఞానానికి నేను చాలా విచారిస్తున్నాను!" అని స్ఫురించే గొంతుతో, "ప్రపంచంలో డబ్బుతరవాత ప్రేమకంటె ఉత్కృష్టపదార్థం లేదని నానమ్మకం!"

హైమ ఆశ్చర్యం నటిస్తూ, "ఒకే మనిషి ఒకే క్షణంలో డబ్బులోనూ ప్రేమలోనూ అంతవిశ్వాసం కనబరచటం మనసంప్రదాయం కాదేమో! అమెరికా వాళ్లు—" అని ప్రారంభించింది.

"ధర్మార్థకామమోక్షాలు! అర్థమూ కామమూ! క్రమంకూడా నేను చెప్పినట్టే ఉంది. అందుచేత నాది బొత్తిగా అమెరికాసంప్రదాయం కాదు. అసలే సంప్రదాయమూ అవసరంలేదు, కాస్త ఆలోచిస్తే మనకే తెలుస్తుంది. డబ్బులేకుండా జీవించటం అసంభవం, ప్రేమలేకుండా జీవించటం అసమగ్రం" అన్నాడు సూర్యం.

"ఎందువల్లా?" అన్నది హైమ.

"ప్రేమించేవరకూ మనలో ఏశక్తు లున్నదీ మనకే తెలియదు. మనలో ఉన్న మంచితనంకూడా అప్పుడు కాని పైకి రాదు. కనీసం అనుభవం అదీ. మాఅమ్మ చచ్చిపోయినతరవాత నేను చాలా చెడ్డ వాణ్ణి అయిపోయినాను. త్యాగంచేసేశక్తీ, నిజంచెప్పే ధైర్యం, ధర్మనిర్ణయంచేసే తెలివీ నాలో ఉన్నై. కాని వాటిని ఎవరిమీద ప్రయోగించను? అసలు వాటిని పైకి తెచ్చేవా రెవరు? అందరితోనూ సత్యహరిశ్చంద్రుడల్లే ఉండటం నా చేతకాదు!"

"ప్రేమ మీకు అంతఆవశ్యకమని తోస్తే ఎవరినో ఒకరిని ప్రేమించలేకపోయినారా? తీరిపోనుగా!" అన్నది హైమ దాదాపు ఎగతాళిగా.

ఒకచెంప జోగారావు విదంతా వింటూ ఉడికిపోతున్నాడు. ఇంత అన్యాయం వాడిఎదట ఎన్నడూ జరగలేదు. తనతో ఎవతెఅయినా అట్లాఅంటే ఆమనిషిని జోగారావు కులటకింద గణించిఉండును. హైమను గురించి సూర్యం ఏమనుకుంటున్నాడో? పైకి మాత్రం అడిగినదానికల్లా ఎంతో ఓర్పుగా ఏదో సమాధానం చెబుతూనే ఉన్నాడు! వీళ్ల సంభాషణ వింటున్న జోగారావుకు కాస్సేపు ఒకరిమీదా, మరికాస్సేపు మరొకరిమీదా కోపం వచ్చేది. సూర్యం వట్టి మూఢుడు — లేకపోతే ఈడు వచ్చిన ఆడపిల్లతో మాట్లాడవలిసింది అట్లాగా? ఆఖరుకు వంకాయలనుగురించి కూడా బట్టబయలుగా చర్చించినచోట శృంగారం పుట్టదే! అటువంటప్పుడు ప్రేమనుగురించీ మనస్తత్వంగురించీ బట్టబయలుగా మాట్లాడుకున్న తరవాత ఇంక శృంగారమేమిటి? హైమ అతన్ని అట్లామాట్లాడ నివ్వట మేమిటి? ... మరొక ధోరణిలో సంభాషించటం మొదలే పెట్టాలి

గాని ఆ ఇద్దరూ ఒకరినొకరు ఎంతగానైనా ప్రేమించుకోవచ్చు! ఒకరికోసం ఒకరు హృదయాలు దగ్ధం చేసుకుని ద్రవించుకో వచ్చునే! జోగారావు అసలు దిసలు అట్లా జరగటం లేదని!

హైమవతి అడిగినదానికి సూర్యం సమాధానం చెప్పాడు, "మనం ప్రేమించటమంటూ ఎప్పుడూ ఉండదు. ఆ భ్రమవల్లనే ఇన్ని అర్థంలేని ప్రణయకథలు పుట్టినై. ఒకడు ఒకతెను ప్రేమించటమూ, ఆమె అతణ్ణి తిరిగి ప్రేమించలేకపోవటమూ, అతగాడు గుండె లవిసి చావటమూనూ! ఒక ప్రణయకథ! నిజం ఏమిటంటే, ఒకమనిషి కామించగలడుగాని ప్రేమించ లేడు. ప్రేమించటానికి ఇద్దరిప్రయత్నమూ అవసరం. అందుచేత జీవితంలో జరిగే దేమంటే మనం ఎవరినీ ప్రేమించం; ఎవరో మనప్రేమ సంపాదిస్తారు. అది నా కింకా జరగలేదు. నాప్రేమ ఎవతెకూడా సంపాదించలేదు. అందుకనే నేను పెళ్లాడలేదు. పెళ్లాడి ప్రేమించటమనేదాన్లో నాకు ఏమాత్రమూ విశ్వాసం లేదు. పెళ్లాడి కొంతకాలం కాపరం చేసిన తరవాత ఏఇద్దరికైనా కొంత పరస్పరాభిమానం కలిగి తీరుతుంది. కాని ఆ అభిమానం ప్రేమకు ప్రత్యామ్నాయంకింద నేను భావించలేను. భావించేవాళ్లుండవచ్చుగాక!"

జోగారావుచెవులకు ఇదంతా కపటంగానూ కృత్రిమంగానూ కనిపించింది; ప్రేమకోసం త్యాగం చెయ్యలేనివాడి కబుర్లు ఇట్లాగే ఉంట వనిపించింది.

"పోనీ మీ రెవరిప్రేమ అయినా సంపాదించారా?" అన్నది హైమవతి కొంటెగా.

"లేదు. నాప్రేమ సంపాదించటానికి సంసిద్ధురాలు కానిదాని ప్రేమ నే నెందుకు సంపాదించాలి?" అన్నాడు సూర్యం.

"మీకు నీతిలో విశ్వాసం ఉందా?" అన్నది హైమవతి.

జోగారావుచేతులు రెండూ కణతలకు చేర్చుకుని కూర్చున్నాడు. వాళ్లసంభాషణధోరణి మార్చటానికి వాడుచేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయినై.

"నాకు నీతిలో చాలా విశ్వాసం ఉంది. పది కోట్లమందియొక్క విశ్వాసాలను కాదనటం నా కేమిటో ద్రోహంగా తోస్తుంది. అయితే జీవితంలో నీతికి మనవాళ్లు అనవసరమైన ప్రాముఖ్యత ఇస్తున్నారని నేను చెప్పగలను! ("నీతలకాయ!" అనుకున్నాడు జోగారావు!) ఏమంటే నీతి అంత ముఖ్యమైనదే అయితే రోజూ దాదాపు ప్రతిమనిషీ ఈ నీతిని అతిక్రమించుతూ వెళ్లగలగటం ఎట్లా సాధ్యమవుతుందీ? అందుకని నేనేం చేస్తానంటే, ప్రబలమైన కారణంలేందీ నీతిని విసర్జించను. నాకది యోగ్యమైన పనిగా తోచింది" అన్నాడు సూర్యనారాయణ.

ఈ విధంగా ఒకవారం గడిచింది. జోగారావు తన మనస్సు తనే తెలుసుకోలేకపోయినాడు. వాళ్లను చూస్తే కోపమూ, తనప్రయత్నం విఫలమైపోతున్నదే అనేదిగులూ, ఇప్పటికైనా వాళ్లను సక్రమమార్గంలో పెట్టేఅవకాశం ఉందేమోఅనే ఆశా వాణ్ణి ఒక్కసారిగా బాధించ సాగినై. ఆఖరుకు ఆశ గెలిచింది. సూర్యనారాయణ ఇంటికి పోయ్యేటప్పుడు జోగారావు అతన్ని కొంతదూరం సాగనంపి దారిలో, "చూడు, సూర్యనారాయణా! నీతో ఒక్కటి చెప్పదామనుకుంటున్నాను. నీకు హైమను చూస్తే ఏ అభిప్రాయం కలిగిందో నాకైతే తెలియదు. అది నిజంగా చాలా తెలివిగలదీ, బుద్ధిమంతురాలూనూ! ఎందుకో అది నీతో సరిగా మాట్లాడటంలేదు. దాని అసలుప్రవృత్తి దాస్తున్నది"- అని ప్రారంభించాడు.

సూర్యం కొంచెం ఆశ్చర్యం కనబరుస్తూ, "ఆవిడ తెలివిగలదికాదనికాని,బుద్ధిమంతురాలు కాదని కాని నా కెన్నడూ అనిపించలేదు. నే నాసంగతి మొదటినుంచీ స్పష్టంగా గ్రహించాను. మీ రనటంవల్ల నా కేదో అనుమానం కలుగుతున్నది!" అన్నాడు.

జోగారావు ఒకక్షణంపాటు నిర్ఘాంతపోయినాడు, కాని తెప్పరిల్లుకుని, "మీ కిద్దరికీ వివాహం జరిగితే నామట్టుకు నేను చాలా సంతోషిస్తాను," అన్నాడు.

"నే నావిణ్ణి పెళ్లేచేసుకునేపక్షంలో నాసంతోషంకోసంకాని ఆవిడ సంతోషంకోసంగాని చేసు

కుంటానుకాని మూడోవాళ్లకోసం చేసుకోను!" అన్నాడు సూర్యం కటువుగా.

"నీవే అతన్ని పాడుచేశావు!" అన్నాడు జోగారావు హైమతో, ఇంటికి వస్తూనే.

"ఏం జరిగింది?" అన్నది హైమవతి.

"నీ వతన్ని ఏమాత్రమూ ఆకర్షించలేకపోయినావు. అతన్ని కదిలించి చూశాను!" అన్నాడు జోగారావు నిస్పృహతో.

"హైమ నవ్వి, అతను ప్రతిరోజూ ఇక్కడికి రావటం నీకోస మనుకున్నావా, బాబాయి?" అన్నది.

జోగారావు నిర్ఘాంతపోయినాడు.

మర్నాడు సూర్యనారాయణ వచ్చినప్పుడు యథాప్రకారమే చర్చ నిన్న విడిచినచోట అందుకున్నారు. అయితే ఇవాళ మాట్లాడటంచార్జీ హైమ పుచ్చుకున్నది.

"నాకు నీతిలో విశ్వాసం లేదు!" అన్నది హైమవతి. "కాని నీతిగా ఉండక ఆడదానికి సాగదు. అయినప్పటికీ నేను ప్రేమకోసం అవినీతిగా ప్రవర్తించగలుగుతానని ధైర్యం ఉంది. నేను ఏమనిషికోసమైతే నీతిని విసర్జించగలనో ఆమనిషిని ప్రేమించానని అనుకుంటాను. లేదా ఏమనిషి నన్ను నీతిగా ఉంచగలిగితే ఆమనిషిని ప్రేమించానని అనుకుంటాను!"

"నీ మోహం!" అనుకున్నాడు జోగారావు. "ఒక్కమాటకూడా సందర్భమూ అర్థమూ లేదు... 'ప్రేమ'అని నోటివెంట అనేస్తే ఇక అందులో శృంగార మేముంది? అదీ మామూలుమాటే!" పైకిమాత్రం జోగారావు ఒక ముక్కుముక్కి ఊరుకున్నాడు.

సూర్యనారాయణ సిగరెట్టు నోట్లోపెట్టుకుని నిప్పపెట్టెకోసం జేబులో తడువుకో సాగాడు. హైమవతి లేచివెళ్లి నిప్పపెట్టెతెచ్చి తనే పుల్లవెలిగించి సిగరెట్టుకు అందించింది.

సూర్యనారాయణ వెళ్లిపోయిన తరవాత జోగారావు హైమతో గట్టిగా మాట్లాడాడు. "నీ వతన్ని పెళ్లి చేసుకోవటానికి ఒప్పుకోకపోయినప్పటికీ అతనితో 'నాకు నీతిలో నమ్మకంలేదూ, నేను ప్రేమకోసం తినినీ వదిలిపెట్టేస్తానూ!' అనటం ఏమీ బాగాలేదు, హైమా! అది–అది ఆడ అందం కాదు. తరవాత, అతనికి సిగరెట్లు వెలిగించిపెట్టటంకూడా మర్యాద కాదు. మీ పెళ్లి స్థిరమైతే అటువంటివి ఏంచేసినా తప్పలేదు!"

హైమ ఆశ్చర్యంతో, "నే నాయన్ని పెళ్లి చేసుకోవటానికి ఈ క్షణాన సిద్ధంగా ఉన్నాను. ఏమిటి నీవనేది?" అన్నది.

"అయితే నిన్ను పెళ్లి చేసుకోవటానికి ఆయన సిద్ధంగాలేడు. సరేనా?...అయినా నీవతన్ని ఎప్పటినుంచి ఆమోదించావో తెలుసుకోవచ్చునా?"

"మొదటినుంచీ మే మిద్దరమూ ఒకరి నొకరు ఆకర్షించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నసంగతి నీవు గమనించటం లేదా?"

"ఆకర్షించటమా? పోట్లాటా?"

"పోట్లా టేమిటి? మే మిద్దరం ఒకళ్లతత్వం ఒకరు అర్థం చేసుకుంటున్నాం. అదే సరయినపద్ధతి. అట్లా కాకుండా ఆయన నాతో "నిన్ను ప్రేమించాను నన్ను పెళ్లాడతావా?' అంటే ఆయనగురించి నా కేం తెలుస్తుందీ?"

జోగారావు మొహం చిట్లించి ఊరుకున్నాడు. మర్నాడు సూర్యం వచ్చేసమయానికి హైమ ఏదో పనిమీద ఉన్న అవకాశం చూసుకుని జోగారావు అతనితో, "మాహైమ నిన్నే విధంగానైనా ఆకర్షించిందాఅని అడుగుదా మనుకుంటున్నాను!" అన్నాడు.

"ఆకర్షించిం దనే చెప్పాలి!" అన్నాడు సూర్యం. "మొదటిసంగతి, ఆవిడ నాతో అబద్ధం ఆడ దని తేల్చుకున్నాను. ఆతరవాత ఆవిడ ప్రేమ నేను సంపాదించగలిగితే ఆతరవాత నన్ను మోసం చెయ్యదని నాకు రూఢి అయిపోయింది. పెళ్లిచేసుకోబోయే ఆడదాన్నిగురించి మొగవాడి కామాత్రం భరవసా ఉండదగినదే. భార్యవిషయంలో అసూయ పడవలసిరావటంకంటె పాపిష్టిసంగతి మరొకటి ఉండబోదు!"

"నిన్ను చూసి హైమ వరించినట్టు కనిపిస్తుంది. దానికి కారణం ఏమిటై ఉండవచ్చును?" అన్నాడు జోగారావు.

సూర్యం కొంచెం ఆలోచించి, "నా డబ్బయి ఉండవచ్చును. నాలో ఇతరలక్షణాలు కొన్ని లేకపోలేదు. కాని అవేవీ డబ్బుతో సమానం కావు. ఒకవిధంగా నేను ప్రేమ సంపాదించటానికి అర్హత పొందానని చెప్పవచ్చును. డబ్బు లేనివాడికి మరొకరి ప్రేమ సంపాదించే అర్హతలేదు. వెనక మా బంధుకోటిలో ఒక పెద్ద మనిషి వృత్తిలో ప్రవేశించ బోతున్న ఒక్క బోగం మనిషితో పరిచయం చేసుకుని ఆమె ప్రేమ సంపాదించాడు. కాని దరిద్రుడు కావటంవల్ల ఆ మనిషికి తిండి అయినా పెట్టలేకపోయినాడు. తరవాత ఆ మనిషి తనవృత్తి సాగించింది, కాని అందులో ఎక్కిరాలేక పోయింది. అటువంటిపని చెయ్యటం ద్రోహమంటాను."

జోగారావు నిర్విణ్ణుడై, "నీడబ్బుకోసం నిన్నెవతెఅయినా ఆపేక్షగా చూస్తే నీకంగీకారమేనా?" అని అడిగాడు.

"నా మొహం చూసి ప్రేమిస్తే అంగీకారం కాదా? నా తెలివితేటలు చూసి ప్రేమిస్తే ఆమోదించనా? అట్లాగే నాడబ్బూనూ! నా మొహానికీ, తెలివితేటలకూ నా వ్యక్తిత్వంతో ఎంతసంబంధం ఉందో నాడబ్బుకూ అంతసంబంధం ఉంది. అది లేకపోతే నే నింకోవిధంగా మాట్లాడతాను, చూపులకే ఇంకో విధంగా కనిపిస్తాను" అని సూర్యం సమాధానం చెప్పాడు.

"నిన్ను కదలించటం నాదే బుద్ధితక్కువ!" అనుకున్నాడు జోగారావు. అసలు వాడి మనస్సు విరిగిపోయింది. హైమవతీ సూర్యనారాయణా, ఇద్దరూ చేరి తనను మూఢుణ్ణి చెయ్యటానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానం వాడికి కలుగసాగింది. ఆ ఇద్దరికీ ఉన్న సంబంధం ఏమిటో ఆ రహస్యంమాత్రం జోగారావుకర్థం కాలేదు. అది ప్రణయం కాదనిమట్టుకు రూఢి చేసుకున్నాడు. అదే ప్రణయమైతే తనకో వాళ్లకో మతి లేదనుకోవాలి!

సూర్యనారాయణకు అప్పు లేమాత్రమో ఉండి ఉండాలి. ఆస్తి ఉన్నవాడికే అప్పులు. ఈ ఒత్తిడి జాస్తి కావటంవల్ల ఆ వ్యవహారాలు పరిష్కరించుకొని రావటానికి సూర్యనారాయణ వాళ్ల ఊరు వెళ్లాడు.

అతను వెళ్లిన క్షణంనుంచీ హైమవతి పూర్తిగా మారిపోయింది. గుబులుగా, పరధ్యానంగా ఉండసాగింది. పలకరిస్తే సరిగాసమాధానం చెప్పకపొయ్యేది. జోగారావు కిదంతా అర్థం కాలేదు. మొదట హైమవతి తనను ఈ విధంగా మోసపుచ్చుచున్నదనుకున్నాడు. కాని రోజులు గడిచినకొద్దీ హైమ యథార్థంగానే బాధపడుతున్నట్టు రూఢి అయింది ఒకసారి ఆమెకళ్లల్లో తడికూడా చూశాడు జోగారావు.

కారణం అడిగితే హైమ చెప్పేసింది.

"తనకెంత అప్పున్నదీ సూర్యం తెలుసుకోలేదు. అతని కేమీ మిగలదు" అతనికి వాళ్లవాళ్లు రాసిన ఉత్తరం చూశాను. నాగతి ఏంకావలిసిఉంది?"

"నీగతి కేం?"

"సూర్యం నన్ను పెళ్లిచేసుకోకపోతే!... ఆయనను మనింటి కెందుకు రానిచ్చావు, బాబాయి? ఇంకోమనిషి నన్ను అట్లా ఆకర్షించే అవకాశం నా జన్మలో ఏముంది?"

"నీకంత మమకారం ఉంటే, డబ్బు లేకపోతే పోయింది, అతన్ని పెళ్లాడరాదూ? అతనన్నట్టు నీవతని డబ్బుచూసే మోహించావా ఏమిటి?" అన్నాడు జోగారావు.

"నీవర్థం చేసుకోవు. ఆడబ్బు వెనక లేకపోతే సూర్యం అందరివంటి మొగుడే అవుతాడు. నన్నాకర్షించింది అందరివంటి మొగవాడుకాదు!"

"నా తలకాయల్లే ఉంది!" అన్నాడు జోగారావు.

కొద్దిరోజులకుసూర్యం దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. అనుకున్నంతా అయింది; అతని ఆస్తి యావత్తూ పోయింది.

"కాని నా అదృష్టం ఇంకా నన్నువిడవలేదు" అని రాశాడు సూర్యం. "నాకొక సంబంధం వచ్చింది. ఆ పిల్లవెంట ఇరవైఅయిదువేల రూపాయల ఆస్తి వస్తున్నది. నిన్ను ప్రేమించే అధికారం నేను పొంతంగా పోగొట్టుకోలేదు!"

"నాకా చివరముక్క అర్థం కాలేదు," అన్నాడు జోగారావు అనుమానంతో.

ఇంత కాలానికి వికసించిన మొహంతో హైమ "నాకర్థ మయింది!" అన్నది.